ఇది రొమ్ము క్యాన్సర్ అవగాహనా మాసం

మన దగ్గర రొమ్ము క్యాన్సర్ బాగా పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 10 లక్షల కొత్త కేసులు గుర్తిస్తుండగా.. మన దగ్గర లక్ష కేసులు బయటపడుతున్నాయి. మన దేశంలో సరైన అవగాహన, ప్రత్యేక బ్రెస్ట్ సెంటర్లు, విస్తృత స్క్రీనింగ్ సదుపాయాలు లేకపోవటంతో రొమ్ము క్యాన్సర్‌ను బాగా ముదిరిపోయిన తర్వాతగానీ గుర్తించటం లేదు. కనీసం 50% క్యాన్సర్లను ముదిరిపోయిన దశలోనే గుర్తిస్తున్నారు. ఎంత ముదిరితే నయం చెయ్యటం అంత కష్టం.

## విలయం నుంచి

# సౌందర్య సంరక్షణ!



డా॥ పి.రఘురామ్
డైరెక్టర్, బ్రెస్ట్ సర్జన్
కిమ్స్-ఉషాలక్ష్మి బ్రెస్ట్ సెంటర్
హైదరాబాద్

రొమ్ముల్లో 'కలవరం' ఆరంభమైతే.. స్త్రీ మనసు మనసులో ఉండదు! అది క్యాన్సరేమోనన్న భయం మెదడును తొలవటం ఆరంభిస్తుంది. ఇక ఆలోచనల శరపరంపర ఆరంభమవుతుంది. క్యాన్సరే అయితే.. అమ్మో, రొమ్ము తీసేస్తారేమో? తీసేస్తే సమాజంలో నగుబాటు తప్పదా? తియ్యకుండా మార్గాలేమీ లేవా?

మరొకరి ముందు రొమ్ముల గురించి మాట్లాడాలంటేనే ఎంతో ఇబ్బందిగా ఉంటుంది.. ఇక ఆసుపత్రికి వెళ్లి వైద్యులకు ఏమని చెప్పాలి..? ఇక ఈ సర్జరీలు, చికిత్సల వంటివన్నీ తట్టుకునేదెలా?

మనసు నిండా ముప్పిరిగొనే సవాలక్ష సందేహాల మధ్య స్త్రీ హృదయం ఎంతో నలిగిపోతుంది. ఆధునిక వైద్యవిధానం దీనికి పరిష్కారంగా రూపొందించినవే.. ప్రత్యేక బ్రెస్ట్ సెంటర్లు! కేవలం రొమ్ములకు సంబంధించిన చికిత్సలు మాత్రమే అందించే ఈ సెంటర్లలో స్త్రీలు ఎటువంటి ఇబ్బందీ లేకుండా.. ఎలాంటి రొమ్ము సమస్యలకైనా సౌకర్యవంతంగా చికిత్స తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

ఇక ఆ గడ్డలు నిజంగా క్యాన్సర్ గడ్డలే అయినా కూడా.. రొమ్ము మొత్తాన్ని తొలగించాల్సిన అవసరం లేకుండా కేవలం గడ్డను మాత్రమే తొలగించి..ఆ విలయం మిగిల్చిన ఆనవాళ్లను కూడా సాధ్యమైనంత వరకూ సరిచేసే 'అంకోప్లాస్టిక్ సర్జరీ' విధానాలు అందుబాటులోకి వచ్చాయి.

ప్రపంచవ్యాప్తంగా అక్టోబరు నెలను 'రొమ్ము క్యాన్సర్ అవగాహనా మాసం'గా జరుపుకొంటున్న సందర్భంగా రొమ్ములకు సంబంధించిన, రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన అత్యాధునికమైన సమాచారాన్ని మీ ముందుకు తెస్తోంది ఈ వారం సుఖీభవ!

ఎదిరొమ్ము క్యాన్సర్ అవగాహనా మాసం

**విలయం నుంచి**

# సౌందర్య సంరక్షణ!

## విధానాలు ప్రధానం

లోపలి క్యాన్సర్ గడ్డను తొలగిస్తే రొమ్ముల మీద సొట్ట, గుంట పడటం అనివార్యం. గతంలో దాన్నలాగే వదిలేసేవారు. ఇప్పటికీ అలాగే వదిలేస్తున్నారు కూడా. దీనికితోడు ఆపరేషన్ తర్వాత రేడియేషన్ థెరపీ కూడా ఇస్తారు: దాంతో రొమ్ము బాగా గుంజినట్లై.. ఆ మచ్చ మరింత ఇబ్బందిగా తయారవుతుంది. ఇక ఆమె రోజూ దాన్నే చూసుకుంటూ.. మానసికంగా కూడా కుంగిపోయే పరిస్థితి నెలకొంటుంది. అందుకే కొందరు రొమ్ముల్లో ఈ సొట్టల బెడద కంటే అసలు మొత్తం రొమ్ము తీయించేసుకున్నా బాగుండేదే..? అనుకునే సందర్భాలూ ఉంటాయి. దీనికి సమర్థమైన పరిష్కారాన్ని యోచించి.. క్యాన్సర్ కారణంగా రొమ్ముల్లో ఎక్కువ భాగం తొలగించినా సొట్టలు పడకుండా ఆ భాగాన్ని పూడ్చేందుకు రకరకాల మార్గాలను అన్వేషించింది 'ఆంకోప్లాస్టిక్' విధానం. దీన్లో రొమ్ముల్లోపలి కణజాలాన్నే అటూఇటూగా సర్దటం ద్వారాగానీ, లేదంటే బయటి నుంచి కొంత కణజాలం తీసుకురావటం ద్వారాగానీ రొమ్ముల ఆకృతిని సరిదిద్దుతారు.



ఆంకోప్లాస్టిక్ విధానంలో..

❖ రొమ్ముల్లో చర్మం కిందే కొంత కణజాలం ఉంటుంది. అలాగే రొమ్ము కిందగా 'పెక్టోరాలిస్ ఫేషియా' అనే కండరాలుంటాయి. వీటిని అవసరమైన చోటికి మళ్లించటం ద్వారా సొట్టలు పూడ్చటం సాధ్యమవుతుంది.

❖ ఒకప్పుడు రొమ్ముల్లో 4 సెం.మీ. కంటే పెద్ద క్యాన్సర్ గడ్డ ఉంటే రొమ్ము మొత్తాన్ని తొలగించక తప్పేది కాదు. ఇప్పుడా అవసరం లేదు. ఆంకోప్లాస్టిక్ విధానాలతో.. రొమ్ము కణజాలాన్ని చాలా ఎక్కువ భాగం తొలగించి కూడా.. రొమ్మును సరిచేసే వీలుంటుంది. ఇక రొమ్ములు పెద్దగా, సాగుతున్నట్టుగా ఉన్నప్పుడు మరింత ఎక్కువ కణజాలం కూడా తొలగించవచ్చు. క్యాన్సర్ సర్జరీ చేస్తున్న ఈ సమయంలోనే.. రొమ్ములను బిగువుగా ఉండేలా ఆకృతి కూడా మార్చొచ్చు. రెండురొమ్ములూ ఒకలా ఉండేందుకు రెండోవైపు రొమ్మునూ బిగువుగా తీర్చిదిద్దొచ్చు

ఇది రొమ్ము క్యాన్సర్ అవగాహనా మాసం

## విలయం నుంచి

# సౌందర్య సంరక్షణ!

### బ్రెస్ట్ స్పెషాలిటీ!

గుండె, కిడ్నీలు.. ఇలా ప్రతి అవయవానికీ క్షుణ్ణంగా, ప్రత్యేక నైపుణ్యంతో చికిత్స అందించేందుకు ప్రత్యేక వైద్య విభాగాలున్నాయి. అలాగే ఇప్పుడు రొమ్ములకు సంబంధించిన-సమస్త సమస్యలకూ చికిత్స అందించేందుకు ప్రత్యేక విభాగం అందుబాటులోకి వచ్చింది. దీన్నే 'బ్రెస్ట్ స్పెషాలిటీ' అంటారు. ఈ విభాగం నిపుణులు రొమ్ములకు సంబంధించిన సాధారణ సమస్యల నుంచి క్యాన్సర్ వరకూ.. అన్నింటికీ ప్రత్యేక నైపుణ్యంతో చికిత్సలు అందిస్తారు. ఇటువంటి విభాగం విదేశాల్లో ఎప్పటి నుంచో ఆరంభమైంది. ఫలితంగా 'బ్రెస్ట్ సెంటర్లు' ఏర్పాటయ్యాయి. ఈ సెంటర్ల ఆవశ్యకత చాలా ఉంది. ఎందుకంటే రొమ్ముల్లో గడ్డల భయంతో పది మంది వైద్యుల వద్దకు వస్తే... వారిలో తొమ్మిది మందికి ఏదో ఒక సాధారణ సమస్యలే ఉంటున్నాయి. కేవలం ఒక్కరికే క్యాన్సర్ ఉండే అవకాశం ఉంది. కాబట్టి క్యాన్సర్ భయంతో, ఆందోళనలతో వచ్చిన వారందరికీ భరోసా ఇస్తూ.. అవసరమైన చికిత్సలు చెయ్యటం బ్రెస్ట్ సెంటర్ల ప్రత్యేకత. ఇందుకోసం ఈ సెంటర్లలో వైద్యులు ప్రధానంగా మూడు పరీక్షలు చేస్తారు. రొమ్ములను చేతితో పరీక్షించి చూడటం, రొమ్ములకు తీసే ఎక్స్-రే మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ పరీక్ష. ఇంకా అవసరమైతే సూదితో రొమ్ములోని అనుమానిత భాగం నుంచి ముక్కతీసి పరీక్షిస్తారు. ఒకవేళ అది క్యాన్సర్ అని తేలితే.. వారికి ప్రత్యేక నైపుణ్యంతో చికిత్స చేస్తారు.

### 'అంకోప్లాస్టిక్' సర్జరీ

రొమ్ముల స్పెషాలిటీ వైద్య విభాగంలో అత్యాధునికంగా అభివృద్ధి చెందుతున్నది 'అంకోప్లాస్టిక్' రొమ్ము సర్జరీ! దీన్ని ప్రధానంగా గత రెండు దశాబ్దాల్లో వచ్చిన విప్లవాత్మకమైన పురోగతిగా చెప్పుకోవాలి. ఒకప్పుడు రొమ్ముల్లో క్యాన్సర్ వస్తే.. రొమ్ము తొలగించటం తప్ప మరో మార్గం ఉండేది కాదు. అలా తొలగించిన తర్వాత తిరిగి కొన్నాళ్లకు రోగి కోరుకుంటే రొమ్మును పునర్నిర్మించే సర్జరీలు చేసేవాళ్లు. అయితే వైద్యపరంగా పురోగతి సాధిస్తున్న కొద్దీ.. ఇప్పుడు రొమ్ము మొత్తాన్ని తొలగించాల్సిన అవసరం బాగా తగ్గిపోతోంది. కేవలం గడ్డ ఒక్కదాన్నే తొలగించే పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఇలా ఒకవైపు క్యాన్సర్ గడ్డను తొలగిస్తూనే.. అదే సమయంలో.. రొమ్ము మీద గుంటలు, సొట్టల వంటివి ఏర్పడకుండా తిరిగి దాన్ని సరిచేయటమే 'అంకోప్లాస్టిక్' సర్జరీ ప్రత్యేకత. రొమ్మును అలాగే ఉంచుతూ.. కేవలం క్యాన్సర్ గడ్డను మాత్రమే తియ్యాలనుకున్నప్పుడు.. క్యాన్సర్ సర్జరీ నైపుణ్యం, ప్లాస్టిక్ సర్జరీ నైపుణ్యాలు రెంటినీ కలగలిపి.. రొమ్ముల ఆకృతిని సాధ్యమైనంత సహజంగా తీసుకొచ్చేందుకు ఆవిర్భవించిందే 'అంకోప్లాస్టిక్' రొమ్ము సర్జరీ విభాగం.

### ఎవరికి?

అంకోప్లాస్టిక్ సర్జరీ విధానాలు ఎవరికి పనికొస్తాయన్నది ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

1. రొమ్ము తొలగించాల్సిన అవసరం లేకుండా కేవలం క్యాన్సర్ గడ్డను మాత్రమే తొలగించే అవకాశం ఉందా?

2. గడ్డను తీస్తే కచ్చితంగా రొమ్ముల మీద సొట్ట పడుతుంది. క్యాన్సర్, ప్లాస్టిక్ సర్జరీ విధానాలతో.. ఆ సొట్టను సరిచేస్తూ రొమ్ము ఆకృతిని కూడా సరిదిద్దే అవకాశం ఉందా?

3. అనివార్యంగా రొమ్ము తొలగించాల్సిందేనా?

ఇవన్నీ పరిశీలించిన తర్వాతే ఈ రకమైన సౌందర్య సంరక్షణ సర్జరీ వీలవుతుందా? లేదా? అన్నది నిర్ధారిస్తారు.

**రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే.. రొమ్మంతా తియ్యాల్సిన అవసరం లేకుండా కేవలం ఆ గడ్డ మాత్రమే తీసి.. రొమ్ముల ఆకృతి చెడకుండా 'అంకోప్లాస్టిక్' సర్జరీ విధానాలతో రొమ్ము రూపం కూడా చెడకుండా చూసుకోవచ్చు. పెద్దగడ్డలు, ఎక్కువ భాగం కండ తొలగించాల్సి వచ్చినా కూడా పైకి పెద్దగా లోపం లేకుండా దాన్ని సరిచేసే అవకాశం ఉంటుంది.**

రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం

# విలయం నుంచి సౌందర్య సంరక్షణ!

❖ రొమ్ములకు పైనుంచి కిందికి, లేదంటే కింది నుంచి పైకి.. రక్తసరఫరా కోసం ప్రత్యేక కణజాలం ఉంటుంది. దీన్నే 'పెడికిల్' అంటారు. వీటిని జాగ్రత్తగా కాపాడుకుంటూ.. మిగతా భాగంలో ఎక్కడ క్యాన్సర్ గడ్డలున్నా వాటిని తొలగించి, ఆకృతి చెడకుండా ఫలితాలు బాగుండేలా సరిచెయ్యొచ్చు



పాత పద్ధతిలో..

❖ కొన్నిసార్లు క్యాన్సర్లు రొమ్ముల్లో పై భాగంలో, లోపలగా ఉంటుంది. వాస్తవానికి ఇక్కడ రొమ్ము కణజాలం చాలా తక్కువగా ఉంటుంది. అక్కడి నుంచి ఎటువంటి గడ్డ తొలగించినా.. కచ్చితంగా పెద్ద సొట్టపడుతుంది. అందుకే అక్కడ కోతపెట్టకుండా.. చనుమొన కిందే కోతపెట్టి.. దాని గుండానే లోపలికి వెళ్లి గడ్డను తీసేసి.. మిగతా రొమ్ము కణజాలాన్ని అక్కడికి చేర్చి.. సొట్ట కనబడకుండా సరిచేసే వీలుంది. తర్వాత చనుమొన తిరిగి మూసేస్తారు. దీన్నే 'రౌండ్‌బ్లాక్ టెక్నిక్' అంటారు.

❖ చనుమొన వెనకాలే క్యాన్సర్ గడ్డ వస్తే.. రొమ్ము తీసెయ్యాల్సిందేనన్నది సంప్రదాయంగా వస్తున్న సూత్రం. అయితే ఇప్పుడు.. దాన్నేగనక తొలి దశలోనే గుర్తించగలిగితే.. 'గ్రిసాటీ ఫ్లాప్' విధానంలో.. చనుమొన కింద ఉండే రొమ్ము భాగం మాత్రమే తీసి.. కింది నుంచి వచ్చే రక్తసరఫరా పెడికల్‌తో ఆ ప్రాంతాన్ని భర్తీ చెయ్యొచ్చు దీంతో రొమ్ము తీసెయ్యాల్సిన అవసరం ఉండదు.

❖ రొమ్ము తియ్యకుండా కేవలం గడ్డనే తీసినప్పుడు.. తప్పనిసరిగా రేడియోథెరపీ ఇవ్వాల్సి వస్తుంది. మనకు కనబడకుండా సూక్ష్మమైన క్యాన్సర్ కణాలు లోపలుండిపోయినా కూడా ఈ రేడియోథెరపీతో నిర్వీర్యమైపోతాయి. కానీ ఈ చికిత్స కారణంగా రొమ్ముల మీద మచ్చ పెద్దగా మారుతుంది. ఆ ప్రాంతానికి రక్తసరఫరా కూడా తక్కువగా ఉంటుంది. ఇటువంటి సందర్భాల్లో.. వీపు కింది భాగంలో ఉండే 'లటిస్‌మస్ డార్సై' కండరాన్ని తీసుకొచ్చి రొమ్ములో ఖాళీ భాగాన్ని భర్తీ చేస్తారు. ఇది బాగా ప్రాచుర్యంలోకి వస్తున్న ప్రత్యేక సర్జరీ విధానం.

## త్వరత్వరగా..!

రొమ్ము క్యాన్సర్‌ను మనం నివారించలేం. కాబట్టి దాన్ని ఎంత త్వరగా గుర్తించగలిగితే అంత మంచిది. అందుకే ప్రతి మహిళా రొమ్ము క్యాన్సర్ విషయంలో అవగాహన పెంచుకోవాలి. అందుకు-

1. రొమ్ములను తరచూ గమనిస్తూ.. సాధారణంగా ఏ సమయంలో తమ రొమ్ములు ఎలా ఉంటాయో గుర్తించాలి. దీన్నే 'బ్రెస్ట్ అవేర్‌నెస్' అంటారు. దీనిలో కొత్తగా ఏమైనా మార్పులేమైనా వస్తుంటే వెంటనే మేల్కొనాలి. ముఖ్యంగా- రొమ్ముల్లో గడ్డలుగానీ, చనుమొన నుంచి రక్తంగానీ, రొమ్ములపై ఎక్కడన్నా సొట్టలు పడటం గానీ, చనుమొన లోపలికి తిరిగిపోవటంగానీ.. ఇలాంటి మార్పులేమైనా కనబడితే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

2. ప్రతి మహిళా 40 సంవత్సరాల నుంచీ తప్పకుండా ప్రతి ఏటా కచ్చితంగా మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవటం అవసరం.

ఈ రెండింటి వల్లా రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించే అవకాశం ఉంటుంది. అలా ముందే గుర్తించి.. సమర్థంగా చికిత్స అందించగలిగితే క్యాన్సర్‌ను పూర్తిగా నయం చెయ్యొచ్చు దీంతో వాళ్లు రొమ్ము క్యాన్సర్ కారణంగా మరణించే పరిస్థితి ఉండదనే చెప్పొచ్చు

## బ్రెస్ట్ సెంటర్

ప్రత్యేక బ్రెస్ట్ సెంటర్లతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. ప్రపంచంలో తొలిగా 'స్పెషలిస్ట్ బ్రెస్ట్ సెంటర్'ను కాలిఫోర్నియాలో వాన్ న్యూస్ ఏర్పాటు చేశారు. 1995 నుంచీ బ్రిటన్లో ఈ సెంటర్ల ప్రాధాన్యం పెరుగుతూ వస్తోంది. తరచూ మామోగ్రఫీ పరీక్షలు చేస్తూ రొమ్ము క్యాన్సర్‌ను చాలాచాలా తొలిదశల్లోనే గుర్తిస్తుండటం వల్ల ప్రత్యేక బ్రెస్ట్ నిపుణుల అవసరం పెరిగింది. అలాగే రొమ్ము మొత్తాన్ని తొలగించెయ్యటం కాకుండా కేవలం గడ్డలను మాత్రమే తొలగించే విధానం బాగా ప్రాచుర్యంలోకి వస్తుండటంతో దీనికోసం ప్రత్యేక నైపుణ్యం, నిపుణుల ప్రాధాన్యం పెరిగాయి. కేవలం రొమ్ములను మాత్రమే చూసే ప్రత్యేక నిపుణుల వల్ల ఉపయోగాలు చాలా ఉన్నాయి. వీళ్లు రోగుల కోసం ఎక్కువ సమయం కేటాయించే వీలుంటుంది, ప్రత్యేక నైపుణ్యం కారణంగా ఫలితాలు బాగుంటాయి, కౌన్సెలింగ్ ఇచ్చే సమయం పెరుగుతుంది, సర్జరీ తదనంతర సదుపాయాలూ అందుతాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా బ్రెస్ట్ యూనిట్స్‌కు ప్రాచుర్యం పెరుగుతోంది.